సాక్షి
ఏలూరు

శుక్రవారం ׀ 15 ׀ మార్చి ׀ 2024



కఠినంగా శిక్షించాలి

గీతాంజలి మృతికి కారణమైన టీడీపీ, జనసేన సోషల్ మీడియా సభ్యులను తక్షణం అరెస్ట్ చేయాలని ఏలూరు, పాలకొల్లులో కొవ్వొత్తుల ర్యాలీలు జరిగాయి. 10లో ▸



ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ

వడ్డీ రాయితీతో ఆస్తి పన్ను చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అవకాశం కల్పించింది. జిల్లాలో ఇప్పటివరకు రూ.31.27 కోట్లు వసూలైంది. 10లో ▸



	ఇఫ్తార్ శుక్ర (సాయంత్రం)	సహరి శని (ఉదయం)
ఏలూరు	6.20	4.49
భీమవరం	6.20	4.53

న్యూస్‌రీల్

వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్‌కు గుర్తింపు


గెడ్డం సుధీర్

ఏలూరు (ఆర్ఆర్ పేట): వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్‌కి రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు లభించిందని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ గురువారం తెలిపారు. తమ సంఘం ఆవిర్భావం నుంచి ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారం కోసం పలు పోరాటాలు చేసి ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి వారధిగా నిలిచిందన్నారు. తమ సంఘానికి ప్రభుత్వ గుర్తింపును ఇచ్చిన సీఎం జగన్, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, శాసనమండలి సభ్యురాలు టి.కల్పలత, ఇతర శాసనమండలి సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ గుర్తింపుపై సంఘ జిల్లా అ ధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సాంబశివరా వు, వడ్లమూడి రామ్మోహనరావు హర్షం వ్యక్తం చేశారు.

టెన్త్ విద్యార్థులకు ఉచిత ప్రయాణం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ ఇంటి నుంచి పరీక్షా కేంద్రం వరకు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించవచ్చని, హాల్‌టికెట్ తప్పక చూపించాలన్నారు.

దివ్యాంగుడికి బ్యాక్‌లాగ్ ఉద్యోగం


నియామక పత్రం అందిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): శారీరక దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో భాగంగా కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని షెడ్యూల్ తెగలకు చెందిన దివ్యాంగుడిని కామాటిగా నియమిస్తూ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ గురువారం నియామక ఉత్తర్వులు అందించారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాకాడ మణి ఉన్నారు.

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

జిల్లాలో ఉద్యోగుల ఫిర్యాదులు స్వీకరించేందుకు ఎంప్లాయీ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి కలెక్టరేట్‌లో నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు.

కొనసాగిన ఇంటర్ పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని 51 కేంద్రాల్లో గురువారం ఇంటర్ కెమిస్ట్రీ, కామర్స్–1 పరీక్షలకు 16,049 మంది విద్యార్థులకు 15,026 మంది హాజరయ్యారు. వీరిలో 14,007 మంది జనరల్ విద్యార్థులకు 13,452 మంది, 2,042 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1,574 మంది హాజరయ్యారు. 94 శాతం హా జరు నమోదైందని కన్వీనర్ ప్రభాకరరావు తెలిపారు.

● జనసేన దారెటు ?

అరువు నేతలే దిక్కు

- టీడీపీ మాజీ ఎమ్మెల్యే అంజిబాబుకు జనసేన టికెట్
- భీమవరంలో రగిలిపోతున్న జనసేన కేడర్
- జనసేనకు ఆరు సీట్లపై టీడీపీలో అసమ్మతి రాగం
- ఉంగుటూరు, తాడేపల్లిగూడెం 'దేశం'లో నైరాశ్యం
- నరసాపురంలోనూ ఇదే పరిస్థితి
- 'పశ్చిమ'లో తారాస్థాయికి 'పొత్తు' రగడ



సాక్షి ప్రతినిధి, ఏలూరు: జనసేన నాయకులను కాదని పక్క పార్టీ నేతలను ముందురోజు చేర్చుకుని వాళ్లనే జనసేన అభ్యర్థిగా ప్రకటించడం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు రాజకీయాలకు అద్దం పడుతోంది. పొత్తులో భాగంగా జనసేనకు టికెట్ కేటాయించినా అప్పటివరకు పక్క పార్టీలో ఉన్న నేతకు కండువా వేసి వారే ఆ నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా ప్రకటించడంతో పార్టీ శ్రేణులు, ప్రజలు కంగుతింటున్నారు. మూడు రోజుల క్రితం వరకు తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా ఉన్న భీమవరం మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఓవర్‌నైట్‌లో జనసేన జెండా కప్పుకుని అభ్యర్థిత్వం దక్కించుకుని భీమవరం నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలిచారు.

టీడీపీ గరంగరం : ఉమ్మడి జిల్లాలో పొత్తుల్లో భాగంగా జనసేనకు ఆరు టికెట్లు కేటాయించడంపై టీడీపీ కేడర్ రగిలిపోతున్నారు. ఉంగుటూరు, నరసాపురం, తాడేపల్లిగూడెం, పోలవరంలో రెండు, మూడు రోజులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసి నానా హడావుడి చేశారు. కట్ చేస్తే.. పార్టీ పట్టించుకోకపోవడంతో ఏం చేయాలో అర్థం కాని రీతిలో తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. పొత్తుల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలో జనసేన అభ్యర్థులను పవన్‌కళ్యాణ్ ప్రకటించారు. అసెంబ్లీ స్థానాల వారీగా నరసాపురానికి జనసేన నేత బొమ్మిడి నాయకర్, తాడేపల్లిగూడేనికి జనసేన నేత బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరుకు జనసేన నేత పత్సమట్ల ధర్మరాజు, భీమవరానికి అరువు నేత పులపర్తి రామాంజనేయులను అభ్యర్థులుగా బుధవారం ప్రకటించారు. గత వారం రోజుల నుంచి జనసేన, టీడీపీ మధ్య టికెట్ కోసం నడిచిన అంతర యుద్ధానికి తెరపడినా టీడీపీ కేడర్ మాత్రం జీర్ణించుకోలేని స్థితిలో ఉన్నారు. జనసేన పార్టీ ఆవిర్భవించాక ఉమ్మడి జిల్లాలో ఒక్క స్థానం కూడా దక్కించుకోని పార్టీకి ఏకంగా ఆరు సీట్లు ఇవ్వడం వాళ్ల స్థాయికి మించిన వ్యవహారమని టీడీపీ కేడర్ బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

ఉంగుటూరు.. పట్టించుకోరు

ఉంగుటూరు టికెట్ ఆశించి భంగపడిన మాజీ ఎమ్మెల్యే, జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు రెండు రోజులు అనుచరులతో సమావేశాలు నిర్వహించి హడావుడి చేసి పార్టీ కేడర్‌తో కార్ల ర్యాలీని మంగళగిరికి ఏర్పాటుచేశారు. అయినా చంద్రబాబును కేడర్ కలవలేకపోయారు. పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉన్న ఒక చోటా నేతకు వినతిపత్రం ఇచ్చి ఉద్యమాన్ని సర్దుకున్నారు. అయితే మండల స్థాయిలో మాత్రం కేడర్ పూర్తిగా రగిలిపోతూ జనసేను పట్టించుకోని పరిస్థితి.

పోలవరం.. అయోమయం

పోలవరం టికెట్ జనసేనకు ఇస్తున్నాం.. సహకరించాలని చంద్రబాబునాయుడు టీడీపీ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్‌కు ఫోన్ చేసి చెప్పడంతో రెండు రోజుల పాటు ఆందోళనలు, ఓ కార్యకర్త పెట్రోలు పోసుకుని హడావుడి చేశారు. కట్ చేస్తే.. జనసేనకు ఇంకా అభ్యర్థి ఎవరూ దొరక్కపోవడంతో టీడీపీలోని నేతలపై దృష్టి పెట్టి వారికి జనసేన కండువా కప్పి టికెట్ ఇచ్చే ప్రయత్నాలు సాగుతున్నట్టు సమాచారం.

బుజ్జగింపుల పర్వం

తాడేపల్లిగూడెం టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జికి చంద్రబాబు ఫోన్ చేసి సహకరించి సర్దుకోమని సూచించారు. నరసాపురంలో ఆశావహులు టీడీపీకి ఎక్కువగా ఉండటంతో ఇన్‌చార్జి పొత్తూరి రామరాజుకు ఫోన్ చేసి ఇక్కడా సర్దుకోమని సూచించారు. ఇదిలా ఉంటే నేతలందరికీ బుజ్జగింపుల పర్వంలో భాగంగా చంద్రబాబు ఫోన్ చేసి అధికారంలోకి రాగానే ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పడం విశేషం. తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి వలవల బాబ్జి తనకు ఎమ్మెల్సీ ఇస్తామని బాబు చెప్పారని మీటింగ్‌లో ప్రకటించగా, ఉంగుటూరు ఇన్‌చార్జి గన్ని వీరాంజనేయులు, పోలవరం ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్‌లకు ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పారని కేడర్‌కు చెప్పుకోవడం కొసమెరుపు.

ఎన్నికల ఖర్చు పక్కాగా లెక్కింపు


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో పుష్పమణి

ఏలూరు(మెట్రో): రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల ఖర్చు పర్యవేక్షణకు రేటు చార్ట్ కచ్చితంగా అమలు చేస్తామని జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో ఎన్నికల ఖర్చు లెక్కింపునకు రేటు చార్ట్ నిర్ణయంపై సమీక్షించారు. అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఖర్చును రేటు చార్ట్ ప్రకారం ఎన్నికల వ్యయ పర్యవేక్షణ విభాగం నిర్ణయించి వారి ఖాతాలో లెక్కిస్తుందన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు తదితరాలకు వినియోగించే వాహనాలు, షామియానాలు, మైక్‌సెట్, ఆహారం, మీడియా ప్రకటనలు తదితరాలన్నీ నిర్దేశిత రేట్ల ప్రకారం నమోదు చేస్తామన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఆర్.వి జయరాజు, పరిశ్రమల కేంద్రం జీఎం ఆదిశేషు, డీపీఆర్‌ఓ ఆర్‌వీఎస్ రామచంద్రరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఏసుబాబు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో సవరించిన పదో తరగతి హాల్‌టికెట్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి హాల్‌టికెట్లలో ఏర్పడిన సాంకేతిక లోపాలను సవరించి తిరిగి వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు డీఈఓ ఎస్.అబ్రహం ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ పరీక్షా కేంద్రం 51006 శ్రీ చైతన్య గవరవరం ఏలూరు, రెగ్యులర్ పరీక్షా కేంద్రం 51017 నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆర్ఆర్‌పేటలో కేటాయించిన హాల్‌టికెట్లు సాంకేతిక కారణాల వల్ల పూర్తి చిరునామా ముద్రితం కాలేదని గుర్తించామని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల సంచాలకులను సంప్రదించి హాల్‌టికెట్లలో లోపాలను సరిచేశామని తెలిపారు. వీటిని బీఎస్ఈ ఏపీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, హెచ్ఎంలు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందించాలని ఆదేశించారు.

అగ్రవర్ణ పేదలకు ఆర్థిక లబ్ధి


కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు ఈబీసీ నేస్తం చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం కింద మూడో విడతలో జిల్లాలో 12,660 మంది అగ్రవర్ణ పేద మహిళల ఖాతాల్లో రూ.18.99 కోట్లు జమచేయనున్నట్టు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సీఎం జగన్ గురువారం బనగానపల్లిలో ఈబీసీ నేస్తం పథకాన్ని ప్రారంభించగా ఏలూరు కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం కలెక్టర్ జిల్లాలో లబ్ధిదారులకు చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమతో పాటు మిగిలిన ఓసీ సామాజిక వర్గానికి చెందిన మహిళలకు ఈబీసీ నేస్తంలో ఏడాదికి రూ.15 వేల చొప్పున అందిస్తున్నారన్నారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా దెందులూరులో 1,752 మందికి రూ.2.63 కోట్లు, నూజివీడులో 2,198 మందికి రూ.3.30 కోట్లు, చింతలపూడిలో 2,669 మందికి రూ.4 కోట్లు, ఏలూరులో 972 మందికి రూ.1.46 కోట్లు, పోలవరంలో 1,748 మందికి రూ.2.62 కోట్లు, కైకలూరులో 1,548 మందికి రూ.2.32 కోట్లు, ఉంగుటూరులో 1,045 మందికి రూ.1.57 కోట్లు, ద్వారకాతిరుమల మండలంలో 728 మందికి రూ.1.09 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత, జిల్లా బీసీ సంక్షేమాధికారి ఆర్.నాగరాణి, మైనారిటీ సంక్షేమాధికారి శ్రీనివాసరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం

ఉంగుటూరు నియోజకవర్గంలో భారీ ర్యాలీ


నారాయణపురం వద్ద జాతీయర రహదారిపై ర్యాలీలో పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు/గణపవరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరోసారి ప్రభంజనం సృష్టించనుందని, విపక్షాలన్నీ ఏకమైనా వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని వక్తలు అన్నారు. గణపవరం మండలం మొయ్యేరు నుంచి పిప్పర, గోపవరం, అర్ధవరం, వరదరాజపురం మీదుగా గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు మండలాలను కలుపుతూ గురువారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వేలాదిగా పార్టీ శ్రేణులు హాజరుకాగా ర్యాలీలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఎంపీ కోటగిరి శ్రీధర్, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, టీటీడీ సభ్యుడు గాదిరాజు సుబ్బరాజు తదితర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలు పేదలకు పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధమని, ఈ యుద్ధంలో పేదల పక్షమే గెలుస్తుందని జోస్యం చెప్పారు. ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రజలకున్న అభిమానం ఓట్ల రూపంలో చూపించి, పేదల వ్యతిరేక పార్టీలకు గుణపాఠం చెప్పాలని కోరారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలే విజయానికి దోహదపడతాయన్నారు. ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఏలూరు పార్లమెంట్‌తోపాటు అన్ని అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి, జగన్‌కు బహుమానంగా ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయా గ్రామాల కూడళ్ల వద్ద పార్టీ కార్యకర్తలు, మహిళలు ప్రదర్శనకు స్వాగతం పలికి, హారతులు ఇచ్చారు. ర్యాలీ గణపవరం చేరేసరికి ప్రదర్శనలో వందలాదిగా కార్యకర్తలు మోటార్ బైక్‌లపై వచ్చి చేరడంతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ప్రదర్శనలో పాల్గొన్న కార్యకర్తలు బైక్‌లపై ఉత్సాహంగా పార్టీ పతాకాలు ఊపుతూ జై జగనన్న, జై వాసన్న అంటూ నినాదాలతో హోరెత్తించారు.

బాధితులకు సత్వర న్యాయం

- పోక్సో, మహిళల కేసుల్లో స్పీడ్ ట్రయల్
- నిందితులకు కఠిన శిక్షలు
- మూడేళ్లలో 20 మందికి జైలు
- 13 మందికి జీవిత ఖైదు


ఏలూరులో యాసిడ్ దాడి సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రేంజ్ ఐజీ, జిల్లా ఎస్పీ (ఫైల్)

కేసులు.. శిక్షలు..

సంవత్సరం	జీవిత ఖైదీ	పదేళ్ల జైలు	ఏడేళ్ల జైలు	ఐదేళ్ల జైలు
2022	2	2	–	2
2023	6	1	1	–
2024	5	1	–	–
మొత్తం	13	4	1	2

ఏలూరు టౌన్: ఏలూరు నగరం విద్యానగర్‌లో 2023 జూన్ 13న రాత్రి 9.30 గంటల సమయంలో యడ్ల ఫ్రాన్సిక అనే మహిళపై ఇద్దరు వ్యక్తులు యాసిడ్ దాడి చేశారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి నిందితులను కేవలం 24 గంటల్లోనే అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు బోడా సతీష్, మరో ఇద్దరిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసులో దిశ పోలీసులు 21 రోజుల్లోనే చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. స్పీడ్ ట్రయల్ చేపట్టిన న్యాయస్థానం 117 రోజుల్లోనే ముగ్గురు నిందితులకు శిక్ష విధించారు. ఒక్కో నిందితుడికి మూడేసి యావజ్జీవ ఖైదు శిక్ష పడింది.

కఠిన శిక్ష విధించేలా..

మహిళలపై నేరాలకు పాల్పడితే కఠినమైన శిక్షలు తప్పవనే విషయాన్ని స్పష్టం చేసేందుకు, నేరస్తులకు భయాన్ని పుట్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, న్యాయస్థానాలు స్పీడ్ ట్రయల్ విధానాన్ని అమలు చేస్తున్నాయి. బాలికలు, యువతులు, మహిళలపై అఘాయిత్యాలు, దాడులు, హత్యలకు పాల్పడితే కఠిన శిక్షలు విధించేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. జిల్లాలో మూడేళ్ల కాలంలో 20కుపైగా కీలక కేసుల్లో నిందితులకు శిక్షలు విధించడం ద్వారా న్యాయస్థానాలు తమ వైఖరిని స్పష్టం చేస్తున్నాయి. పోలీస్ శాఖ, న్యాయస్థానాలు స్పీడ్ ట్రయల్ నిర్వహిస్తూ కేసులను పరిష్కరించి బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం కల్పించే దిశగా అడుగులు వేయడం శుభపరిణామమని పలువురు అభిప్రాయపడుతున్నారు. బాధిత మహిళలకు న్యాయం చేయడం ద్వారా చట్టాలపై నమ్మకం కలిగేలా అటు పోలీసు వ్యవస్థ ఇటు న్యాయవ్యవస్థ కీలకమైన నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయమని అంటున్నారు.

నేరాలపై కఠినంగా వ్యవహరిస్తాం



ఏలూరు రేంజ్ పరిధిలో అన్ని జిల్లాల్లోనూ మహిళలు, యువతులు, బాలికలపై అఘాయిత్యాలు, హత్యలు, దాడులకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తాం. ఆయా జిల్లాల్లో కొన్ని కీలక కేసులను ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిందితులకు కఠిన శిక్షలు విధించేలా పోలీస్ అధికారులు ప్రత్యేక దర్యాప్తు చేయడంతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు చర్యలు చేపట్టాం. మహిళలపై నేరాలకు పాల్పడాలంటే భయం కలిగేలా అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నాం.

– జీవీజీ అశోక్ కుమార్, ఐజీ, ఏలూరు రేంజ్

బాధితులకు అండగా..



చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడితే శాశ్వతంగా జైలులోనే ఉంచేలా కఠిన శిక్షలు విధించేలా చర్యలు చేపడుతున్నాం. దిశ పోలీస్‌స్టేషన్లకు వచ్చే బాధితులకు అండగా నిలబడుతున్నాం. శిక్షలు పడేలా న్యాయస్థానాలతో పాటు మా వంతు కృషి చేస్తున్నాం. నేరస్తుల గుండెల్లో వణుకుపుట్టేలా వ్యవహరిస్తాం. ఏలూరులో యడ్ల ఫ్రాన్సిక కేసులో ముగ్గురు నిందితులకు ఒక్కొక్కరికి మూడు జీవిత ఖైదులు విధించడం రాష్ట్రంలోనే ప్రథమంగా నిలుస్తుంది.

– డి.మేరీ ప్రశాంతి, జిల్లా ఎస్పీ

వివాదాల చింతమనేని

- దెందులూరు టీడీపీ టికెట్ ఖరారు
- జనసేన, టీడీపీ నేతలతో తీవ్రస్థాయిలో విభేదాలు
- చింతమనేనికి టికెట్ వద్దంటూ రెండు పార్టీల సమావేశాలు
- టీడీపీ హయాంలోనే చింతమనేనిపై రౌడీషీట్
- పవన్‌కళ్యాణ్, చిరంజీవిపై వ్యక్తిగతంగా దూషణ



సాక్షి ప్రతినిధి, ఏలూరు: రౌడీనేత చింతమనేని ప్రభాకర్‌ను దెందులూరు టీడీపీ అభ్యర్థిగా గురువారం ప్రకటించారు. వరుస వివాదాలు, నోటి దురుసు, ఘర్షణలతో నిత్యం వివాదాస్పద నేతగా గుర్తింపు ఉన్న చింతమనేనికి నిన్నటివరకు టికెట్ టెన్షన్ వెంటాడింది. సొంత సామాజికవర్గ నేతలు మొదలు, మిత్రపక్షాల వరకు అందరూ తీవ్ర స్థాయిలో వ్యతిరేకించడంతో పెండింగ్‌లో పడిన టికెట్ పలు రాజకీయ హైడ్రామాల నడుమ చివరికి అతడినే వరించింది. అయితే జనసేన, టీడీపీ నేతలతో తీవ్రస్థాయి విభేదాలు ఉండటంతో సరికొత్త గందరగోళానికి తెర లేచింది.

టికెట్ ఇవ్వవద్దంటూ..

చింతమనేనికి టికెట్ ఇవ్వవద్దంటూ నియోజకవర్గానికి చెందిన చంద్రబాబు సామాజికవర్గ వ్యక్తులు, నేతలు 20 మంది కొన్ని నెలల క్రితం చంద్రబాబుని కలిసి చింతమనేనిపై ఫిర్యాదు చేసి ప్రత్యామ్నాయంగా మాగంటి బాబు అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరారు. పార్లమెంట్ ఇన్‌చార్జిగా ఉన్న మాగంటి బాబు, పార్లమెంట్‌తో పాటు దెందులూరులోనూ హడావుడిగా కార్యక్రమాలు నిర్వహించారు. ఆ తర్వాత జనసేన, టీడీపీ నేతలు సంయుక్తంగా జనసేన నేత కొఠారి ఆదిశేషు నేతృత్వంలో సమావేశం నిర్వహించి చింతమనేనికి టికెట్ వద్దంటూ సమావేశం నిర్వహించి రెండు పార్టీ నేతలకు ఫిర్యాదులు చేశారు. దీంతో చింతమనేని రాజకీయ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. టీడీపీ నేత చనుమోలు అశోక్‌గౌడ్, చింతమనేని కేసులు వాదించే న్యాయవాది ఈడ్పుగంటి శ్రీనివాసరావు టికెట్ కోసం ప్రయత్నించారు. ఒక దశలో చింతమనేని సతీమణి, కుమార్తెలు పోటీ చేస్తారని బలంగా ప్రచారం సాగింది. ఈ పరిణామాల క్రమంలో చింతమనేని ప్రభాకర్‌ను అభ్యర్థిగా ప్రకటించడంతో దెందులూరు నియోజకవర్గంలో రాజకీయ స్తబ్ధత నెలకొంది.

టీడీపీ హయాంలో రౌడీషీట్

85కుపైగా కేసులున్న మాజీ ప్రజాప్రతినిధిగా చింతమనేని ప్రభాకర్ రికార్డుకెక్కారు. 2009లో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అప్పటి మంత్రి వట్టి వసంత్‌కుమార్‌పై దాడి చేసిన కేసు, 2015లో ఇసుక తవ్వకాలకు అడ్డుపడిన తహసీల్దార్ వనజాక్షిపై దాడి ఘటనలతో రాష్ట్రస్థాయిలో రౌడీనేతగా అతడిపై ముద్రపడింది. దీంతో గత తెలుగుదేశం పార్టీ హయాంలోనే చింతమనేనిపై రౌడీషీట్ తెరవటం గమనార్హం. పదుల సంఖ్యలో కేసులు, నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాలతో తీవ్ర విభేదాలు ఉన్న నేతకు టికెట్ ఇవ్వడంపై నియోజకవర్గంలో సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతుంది. గతంలో పవన్‌కళ్యాణ్, చిరంజీవిని, కాపు కులాన్ని అడ్డగోలు రీతిలో దూషించి చింతమనేని తీవ్ర రాజకీయ చిక్కుల్లో చిక్కుకున్నారు. ఇలా పలు వివాదాలు వెంటాడుతున్నా నోటి దురుసు నైజం మార్చుకోకుండా కొనసాగుతూనే ఉన్నారు.

అందరితోనూ గొడవలే..

అతికష్టం మీద టికెట్ దక్కించుకున్న చింతమనేనికి సొంత పార్టీ నేతలే వెన్నుపోటు పొడవనున్నారు. చింతమనేనికి కాకుండా ఎవరికి ఇచ్చినా అభ్యంతరం లేదని బహిరంగంగా టీడీపీ, జనసేన నేతలే చెప్పారు. ఇక సొంత కులంలోనే చింతమనేనిపై తీవ్ర వ్యతిరేకత ఉంది. అలాగే నియోజకవర్గంలో ముఖ్య నాయకులతో గొడవలు ఎక్కువగా ఉండటంతో ఎవరి సహకారం ఉండదనే చర్చ మొదలైంది. ప్రధానంగా చింతమనేనికి టికెట్ కేటాయించడంపై జనసేనలో తీవ్ర అసంతృప్తి మొదలైంది. పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను మొదలు అందరినీ ఇష్టానురీతిలో తిట్టిన వ్యక్తికి సహకరించమని గతంలోనే జనసేన నేతలకు అల్టిమేటం జారీ చేశారు. దీంతో చింతమనేని టికెట్ దక్కించుకున్నా.. టీడీపీ కేడర్‌లో గురువారం స్పందన కనిపించని పరిస్థితి.

క్లుప్తంగా

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా భవాని రూప

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



ఏలూరు టౌన్ : రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఏలూరుకు చెందిన మోటమర్రి భవాని రూప నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల నుంచి 15 మంది డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా ఏలూరు జిల్లాకి సంబంధించి భవాని రూపను నియమించారు. ఏలూరు నగరంలో వైఎస్సార్‌సీపీ జేసీఎస్ నగర కన్వీనర్‌గా, ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మోటమర్రి సదానంద కుమార్ పార్టీ పటిష్టానికి విశేష సేవలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని సహకారంతో సదానందకుమార్ సతీమణి భవాని రూపను ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరుతో పాటు జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలు, ఏలూరు పార్లమెంట్ సీటును వైఎస్సార్‌సీపీ గెలుచుకునేలా తమ వంతు కృషి చేస్తామని ఆమె తెలిపారు.

ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విధులకు సక్రమంగా హాజరు కాకపోవడం, విద్యార్థినులను దండించడం వంటి కారణాలతో జిల్లాలో ఇద్దరు ఉపాధ్యాయులను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (హిందీ)గా పనిచేస్తున్న ఎస్.గోవిందరావు విద్యార్థినులను దండించిన కారణంగా విధుల నుంచి సస్పెండ్ చేశామన్నారు. అలాగే గణపవరం మండలం పిప్పర జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (పీఈ)గా పనిచేస్తున్న ఆర్.సీతారాం పాఠశాల విధులు సక్రమంగా నిర్వహించకపోవడం, బాలికలను దండించడం వంటి కారణాలతో సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

బాలికను మోసం చేసిన నిందితుడి అరెస్టు

భీమవరం : బాలికను మోసగించిన చేసిన కేసులో నిందితుడ్ని అరెస్టు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను గురువారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వన్‌టౌన్ గునుపూడికి చెందిన 8వ తరగతి చదువుతున్న 14 ఏళ్ల బాలికను అదే ప్రాంతంలో కోడిమాంసం విక్రయించే 38 ఏళ్ల వయస్సు కలిగిన నల్లగంగుల అనిల్‌కుమార్ మాయమాటలు చెప్పి శరీరకంగా లొంగదీసుకున్నాడు. బాలిక అనారోగ్యంగా ఉండడంతో కుటుంబసభ్యులు వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన డాక్టర్ బాలిక 8 నెలల గర్భవతిగా తేల్చిచెప్పారు. దీనితో బాలికను నిలదీయగా అనిల్‌కుమార్ వ్యవహారం బయటపడడంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, బాలికను వైద్యపరీక్షల కోసం ఆసుపత్రికి పంపించి నిందితుడ్ని అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు.

ఆస్తి పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ

- జిల్లాలోని మున్సిపాలిటీల్లో డిమాండ్ రూ.73.19 కోట్లు
- ఇప్పటివరకు వసూలైన పన్ను రూ.31.27 కోట్లు
- పూర్తిగా చెల్లిస్తే రూ.17.22 కోట్ల మేర చేకూరనున్న లబ్ధి



జంగారెడ్డిగూడెం: వడ్డీ రాయితీతో ఆస్తి పన్ను చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అవకాశం కల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో ప్రస్తుత సంవత్సరానికి ఆస్తి పన్ను బకాయిలు లేకుండా వసూలు చేసేందుకు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఈ మేరకు జీవో ఎంఎస్ నంబర్ 35ను జారీ చేశారు. దీని ప్రకారం ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో ప్రస్తుత సంవత్సరంతో పాటు గత సంవత్సరాల్లో బకాయిలను సైతం పూర్తిగా చెల్లిస్తే వడ్డీ రాయితీ వర్తించనుంది. దీంతో ఏలూరు జిల్లాలో కోట్లాది రూపాయల వడ్డీ రాయితీ ప్రజలకు లభించనుంది.

జిల్లాలో 1 కార్పొరేషన్, 3 మున్సిపాలిటీలు

ఏలూరు జిల్లాలో ఏలూరు కార్పొరేషన్, జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయా మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను మొత్తంగా రూ.73.19 కోట్ల డిమాండ్ ఉంది. అయితే ఇప్పటివరకు రూ.31.27 కోట్లు వసూలు చేశారు. మిగిలిన మొత్తానికి వడ్డీ రాయితీ ప్రభుత్వం కల్పించింది. ఈ నెలాఖరులోగా ఎన్నో ఏళ్ల నుంచి ఆస్తి పన్ను బకాయిలు ఉన్నా పూర్తిగా చెల్లిస్తే వడ్డీ రాయితీ కల్పించనుంది. దీంతో ఏలూరు జిల్లాలో మొత్తంగా 17.22 కోట్ల మేర ప్రజలకు లబ్ధి చేకూరనుంది. వడ్డీ రాయితీ కల్పించడంతో ఈ మొత్తం ప్రజలకు ఆదా అవుతుంది. ఏలూరు కార్పొరేషన్‌లో 41.7 శాతం, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో 46.30 శాతం, నూజివీడులో 47.10 శాతం, చింతలపూడి నగర పంచాయతీలో 38.30 శాతం మేర ఆస్తి పన్ను ఇప్పటివరకు వసూలైంది.

ఈ నెలాఖరు వరకు గడువు



ఆస్తి పన్ను చెల్లింపుదారులకు మంచి లబ్ధి చేకూరుతుంది. ప్రభుత్వం ఆస్తి పన్ను చెల్లింపుపై వడ్డీ రాయితీ ప్రకటించింది. ఈ నెలాఖరులోగా ఆస్తి పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ లభిస్తుంది. అలాగే ఇప్పటి వరకు వడ్డీతో చెల్లించిన వారికి కూడా వచ్చే ఏడాది ఆ వడ్డీని మినహాయించి మిగిలిన ఆస్తి పన్నును ప్రభుత్వం కట్టించుకుంటుంది. దీని వల్ల ప్రజలకు మేలు చేకూరుతుంది.

– నాగొట్టి నరేంద్రకుమార్, కమిషనర్, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ

జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వివరాలు

మున్సిపాలిటీ	అసెస్‌మెంట్	ఆస్తిపన్ను డిమాండ్ (రూ.కోట్లలో	ఇప్పటి వరకు వసూలు (రూ.కోట్లలో)	లభించే వడ్డీ రాయితీ (రూ.కోట్లలో)
ఏలూరు (కార్పొరేషన్)	68756	54.55	22.73	13.00
జంగారెడ్డిగూడెం	13831	8.45	3.91	1.90
నూజివీడు	13361	8.21	3.87	1.81
చింతలపూడి	7223	1.98	0.76	0.51

జపాన్‌లో ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ అర్హతలు కలిగిన వారికి జపాన్ దేశంలోని హాస్పిటళ్లలో కేర్ వర్కర్స్, కేర్ హోమ్ ఫెసిలిటేటర్‌గా ఉద్యోగావకాశాలు కల్పించే నిమిత్తం ఆసక్తి కలిగిన అభ్యర్థులకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఘంటా సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జపాన్ భాషలో పూర్తి రెసిడెన్షియల్ తరగతి విధానంలో బెంగళూరు కేంద్రంగా ఆరు నెలల శిక్షణ ఉంటుందన్నారు. 18 నుంచి 32 సంవత్సరాల వయస్సున్న యువతీ యువకులు ఈ శిక్షణకు అర్హులన్నారు. శిక్షణ కోసం రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.50 చెల్లించాల్సి ఉంటుందని, దీనిలో రూ.25 వేలు అభ్యర్థి చెల్లిస్తే మిగిలిన రూ.25 వేలు నైపుణ్యాభివృద్ధి సంస్థ చెల్లిస్తుందన్నారు. అలాగే శిక్షణ నిమిత్తం అభ్యర్థులు రూ.3 లక్షలు చెల్లించాలని, శిక్షణ కాలంలో ఆరు నెలల పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జపాన్‌లో నెలకు రూ.1.10 లక్షలు నుంచి రూ.1.40 లక్షల జీతంతో ఉద్యోగాలు కల్పించబడతాయని, ఇతర వివరాలకు 90302 27668 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

భీమవరం జనసేన సభలో ఉద్రిక్తత

- వీరవాసరం నాయకుడిపై చినబాబు వర్గం మండిపాటు
- చుట్టుముట్టి దాడికి సిద్ధం కావడంతో కంగుతిన్న కార్యకర్తలు
- పార్టీలో గ్రూపు రాజకీయాలపై ఎన్నికల్లో పరిస్థితిపై ఆందోళన

భీమవరం : జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం భీమవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. భీమవరం జనసేన పార్టీ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఆధ్వర్యంలో ఒక కల్యాణ మండపంలో పార్టీ ఆవిర్భావ వేడుక, అంజిబాబు పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని వీరవాసరం, భీమవరం మండలాలతో పాటు, భీమవరం పట్టణానికి చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. మొన్నటివరకు జనసేన పార్టీకి సంబంధం లేని అంజిబాబుకు పార్టీ టికెట్ ఇవ్వడంతో ఎప్పటి నుంచో పార్టీ కోసం పనిచేస్తున్న కొంతమంది నాయకులు, కార్తకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అంజిబాబుకు టికెట్ ఇవ్వద్దంటూ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. దీంతో వారిని బుజ్జగించడానికి కార్యక్రమం ఏర్పాటు చేయగా దానికి పరిచయ కార్యక్రమమంటూ ప్రచారం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు), పార్టీ పీఏసీ సభ్యుడు వేగేశ్న కనకరాజు సూరి, వీరవాసరం జెడ్పీటీసీ గుండా జయప్రకాష్‌నాయుడు, చెనమల్ల చంద్రశేఖర్ తదితరులు పార్టీ నాయకులు, కార్యకర్తలను పరిచయం చేశారు. ఇదే సమయంలో వీరవాసరం మండలానికి చెందిన ఒక నాయకుడు వేదిక వద్దకు వస్తున్న సమయంలో చినబాబుపై విమర్శలు చేసిన వాడివి ఇక్కడికి ఎందుకు వచ్చావంటూ పెద్ద సంఖ్యలో చుట్టుముట్టి దాడికి సిద్ధమయ్యారు. దీంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్తత నెలకొంది. మిగిలిన వారికి అక్కడ ఏం జరుగుతుందో అర్థంగాక మహిళలు, కార్యకర్తలు భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో కొంతమంది జోక్యం చేసుకుని వివాదం ముదరకుండా సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో సదరు నాయకుడు అక్కడి నుంచి బయటికి వెళ్లిపోవడం గమనార్హం. మొత్తం మీద జనసేన పార్టీలో నివురుగప్పిన నిప్పులా ఉన్న గ్రూపు రాజకీయాలు బయటపడుతుండడంతో ఎన్నికల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది.

బాలికల మిస్సింగ్ కేసు 24 గంటల్లో ఛేదింపు



- స్కూల్‌కు వెళుతున్నామని చెప్పి రైలెక్కిన బాలికలు
- ఐటీ టీమ్ సహకారంతో నంద్యాలలో గుర్తింపు
- తల్లిదండ్రులకు క్షేమంగా బాలికల అప్పగింత
- నూజివీడులో విలేకరులకు డీఎస్పీ లక్ష్మయ్య వెల్లడి

నూజివీడు: ఆగిరిపల్లి మండలం సూరవరంలో ముగ్గురు బాలికల మిస్సింగ్ కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన ఓ వ్యక్తి సలహా మేరకు రైలులో నంద్యాల వెళుతుండగా పోలీసులు సాంకేతిక సాయంతో గుర్తించి వారిని తల్లిదండ్రుల చెంతకు క్షేమంగా చేర్చారు. ఈ కేసు వివరాలను నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మయ్య గురువారం విలేకరులకు వెల్లడించారు. ఆగిరిపల్లి మండలం సూరవరం జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ముగ్గురు బాలికలు ఈనెల 13న ఉదయం స్కూల్‌కు వెళ్తున్నామని చెప్పి స్కూల్‌కు వెళ్లకుండా ఎక్కడికో వెళ్లిపోయారు. పనులకు వెళ్లిన తల్లిదండ్రులు సాయంత్రం ఇంటికి తిరిగి రాగా, అప్పటికీ పిల్లలు స్కూల్ నుంచి ఇంటికి రాకపోవడంతో తోటి విద్యార్థులను ఆరా తీయగా, స్కూల్‌కు రాలేదని తెలుసుకుని వెంటనే ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ముగ్గురు బాలికల్లో ఒకరి వద్ద సెల్‌ఫోన్ ఉండటంతో ఆగిరిపల్లి ఎస్సై బి.సురేంద్రకుమార్ వెంటనే సెల్‌ఫోన్ లోకేషన్‌ను సెర్చ్ చేయగా వినుకొండ వైపు వెళుతున్నట్లు తెలిసింది. దీంతో ఏమార్గంలో వెళుతున్నారనే విషయమై ఐటీ టీమ్‌ను సంప్రదించి రైలులో వెళుతున్నట్లు నిర్ధారించుకున్నారు. వెంటనే నూజివీడు రూరల్ సీఐ కె.రామకృష్ణ నంద్యాల పోలీసులను సంప్రదించి విషయం తెలియజేయగా వారు వెంటనే రైల్వేస్టేషన్‌కు వెళ్లి బాలికలు ఏ బోగీలో ఉన్నారో గుర్తించి అదుపులోకి తీసుకుని సమీపంలోని బాలికల హాస్టల్‌లోకు తరలించారు. ఆగిరిపల్లి ఎస్సై సురేంద్రకుమార్ హుటాహుటిన ఇక్కడ నుంచి బాలికల తల్లిదండ్రులను తీసుకుని బయలుదేరి నంద్యాల వెళ్లి గురువారం సాయంత్రానికి బాలికలను ఆగిరిపల్లికి తీసుకువచ్చారు. చదువుకోవాలంటూ తల్లిదండ్రులు మందలించడమే కారణమని డీఎస్పీ తెలిపారు. అంతేగాకుండా ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన వ్యక్తి నంద్యాల రమ్మని పోస్టు చేయడంతో వీరు నంద్యాల వెళ్లినట్లు చెప్పారన్నారు. 24 గంటల్లో బాలికల మిస్సింగ్ కేసు ఛేదించడంతో రూరల్ సీఐ కె.రామకృష్ణ, ఎస్సై సురేంద్రబాబులను ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించడంతో పాటు రివార్డ్‌కు రికమండ్ చేయాలని డీఎస్పీకి సూచించారు.

తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి

యుక్తవయస్సుకు వచ్చిన పిల్లలు ఏం చేస్తున్నారనే విషయమై తల్లిదండ్రులు బాధ్యతగా గమనిస్తూ ఉండాలని, వారి పట్ల కఠినంగా వ్యవహరించకుండా అర్థమయ్యే రీతిలో చెప్పాలన్నారు. అలాగే సెల్‌ఫోన్‌లు ఇవ్వడం చేయొద్దని, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి అకౌంట్‌లు లేకుండా చూడాలని డీఎస్పీ సూచించారు.

మద్దిపాటికి అసమ్మతి సెగ

ద్వారకాతిరుమల: గోపాలపురం టీడీపీ టికెట్‌ను మద్దిపాటి వెంకటరాజుకు ఖరారు చేస్తూ అధిష్టానం గురువారం ప్రకటించడంతో ఆ పార్టీకే చెందిన మద్దిపాటి వ్యతిరేక వర్గం విస్మయానికి గురైంది. గోపాలపురం టికెట్‌ను మద్దిపాటి వెంకటరాజుకు ఇవ్వవద్దని, దీని వల్ల ఇక్కడ ఓడిపోతామని సొంత పార్టీకి చెందిన ఓ ముఖ్యనేత వర్గం పార్టీ అధినేత దృష్టికి పలుసార్లు తీసుకువెళ్లారు. మద్దిపాటికి తప్ప ఎవరికి టికెట్ ఇచ్చినా పర్వాలేదంటూ చెప్పారు. ఇటీవల 500కిపైగా కార్లతో మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయానికి సైతం ర్యాలీగా వెళ్లి ఆందోళనలు కూడా చేశారు. దీంతో ఈ విషయాన్ని పరిశీలిస్తామని ఆ పార్టీ ముఖ్య నేతలు చెప్పడంతో ఇక మద్దిపాటికి టికెట్ రాదని ధీమాగా ఉన్నారు. ఈ నేపథ్యంలో గురువారం గోపాలపురం టికెట్‌ను మద్దిపాటికి ప్రకటించడంతో వ్యతిరేక వర్గం నేతలు జీర్ణించుకోలేని పరిస్థితి ఏర్పడింది.

తమ సూచనలను పార్టీ అధిష్టానం కనీసం పరిగణలోకి తీసుకోలేదని కొందరు నేతలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఎన్నికల్లో మద్దిపాటి అనుకూలంగా పనిచేసేది లేదని బహిరంగంగా చెబుతున్నారు. మద్దిపాటికి టికెట్ ఇవ్వడం వల్ల ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తానేటి వనిత గెలుపు నల్లేరుపై నడకేనని టీడీపీ అసమ్మతి నేతలు వాపోతున్నారు. టికెట్ ఇవ్వొద్దని ఎన్నోసార్లు మొత్తుకున్నా పార్టీ అధిష్టానం అసమ్మతి వర్గాన్ని లెక్కచేయకుండా మద్దిపాటి పేరు ప్రకటించడంతో వారు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. దీంతో ఈ ఎన్నికల్లో మద్దిపాటిని ఎలాగైనా ఓడించాలని వ్యతిరేక వర్గ నాయకులు పట్టుదలగా ఉన్నట్టు తెలుస్తోంది.

వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర కార్యదర్శిగా సత్యనారాయణ



భీమవరం : వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర కమిటీలో భీమవరానికి చెందిన ఇంటి సత్యనారాయణకు చోటుదక్కింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో టీయూసీ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ పి గౌతమ్‌రెడ్డి నియమితులు కాగా, ఆ కమిటీలో పట్టణానికి చెందిన ఇంటి సత్యనారాయణ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, కమిటీ అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డికి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

20 లీటర్ల సారా స్వాధీనం

టి.నరసాపురం: మండలంలోని తెడ్లం గ్రామంలో నాటుసారా తయారీ కేంద్రాలపై గురువారం దాడి చేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై దుర్గామహేశ్వరరావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో సారా తయారు చేస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు గ్రామంలో గురువారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో డేరంగుల దుర్గారావు అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి 20 లీటర్ల సారా, ఒక గ్యాస్ పొయ్యి, ఒక గ్యాస్ స్టౌ, రెండు అల్యూమినియం పాత్రలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



శంకర్ మృతదేహం

కొయ్యలగూడెం: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొయ్యలగూడెంలో వడ్డీల పేటకు చెందిన తోట శంకర్ (35)కు 17 ఏళ్ల క్రితం తోట కల్యాణితో వివాహమైంది. మద్యానికి బానిసైన శంకర్ రోజూ మద్యం తాగి వచ్చి ఇంట్లో భార్య, పిల్లలతో గొడవపడుతూ వారిని కొడుతుంటాడు. ఈ క్రమంలో ఈ నెల 13న రాత్రి శంకర్ మద్యం తాగి భార్య, పిల్లలను కొట్టాడు. దీంతో అతని తీరుతో విసిగిపోయిన భార్య, పిల్లలు రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయారు. గురువారం వారు ఇంటికి తిరిగొచ్చి చూసేసరికి శంకర్ శరీరం ఇంట్లో దూలానికి వేలాడుతూ ఉంది. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

టీడీపీ నీచ సంస్కృతికి గీతాంజలి బలి

- గీతాంజలి ఆత్మహత్యపై వైఎస్సార్‌సీపీ నిరసన
- ఏలూరు మహిళా నేతలు కొవ్వొత్తుల ప్రదర్శన



ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

ఏలూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటి పట్టా ఇవ్వడంతో తన సొంతింటి కల నెరివేరిందంటూ మీడియా ఎదుట సంతోషంగా తనకు జరిగిన మేలును తెనాలికి చెందిన మహిళ గీతాంజలి చెబితే.. టీడీపీ, జనసేన సోషల్ మీడియా నీచ సంస్కృతితో వేధింపులకు గురిచేసి ఆమెను బలిగొన్నారని వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు ధ్వజమెత్తారు. ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని ఆదేశాల మేరకు ఏలూరు నగర పార్టీ మహిళా అధ్యక్షురాలు నున్న స్వాతి శ్రీదేవి ఆధ్వర్యంలో పార్టీలోని మహిళా నేతలు ఏలూరులోని ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా స్వాతిశ్రీదేవి మాట్లాడుతూ టీడీపీ, జనసేనకు సంబంధించి సోషల్ మీడియా అత్యంత పాశవికంగా సభ్యసమాజం తలదించుకునేలా వ్యవహరించి గీతాంజలి అనే మహిళను మానసికంగా వేధించి ఆమె చావుకు కారణమయ్యారని ఆరోపించారు. గీతాంజలి వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యకర్త కాదని, ఆమె ఇంటి స్థలం పట్టా తీసుకున్న ఆనందంలో మాత్రమే తనకు జరిగిన మంచిని మీడియాకు చెప్పిందని, ఆ విధంగా చెప్పటం నేరమా అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో ఎంతో మంది మహిళలను వేధించి కాల్‌మనీ కేసుల్లో ఇరికించి వేధించిన చరిత్ర ఉందని, ప్రతిపక్షంలో ఉండి కూడా టీడీపీ నీచ రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. క్లస్టర్-3 మహిళా అధ్యక్షురాలు తుమరాడ స్రవంతి, కార్పొరేటర్లు జిజ్జువరపు విజయనిర్మల, ఇనపనూరి కేదారేశ్వరి మాట్లాడుతూ ఒక మహిళ మృతిని సైతం లోకేష్ రాజకీయాలు చేయటం అత్యంత దారుణమన్నారు. తప్పును ఒప్పుకోకుండా ఆమె వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా ఆరోపణలు చేయడం వారి నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కల్పించేందుకు అనేక చర్యలు తీసుకున్నారని, మహిళా పక్షపాతిగా ఉంటూ మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. మరోసారి ఇటువంటి సంఘటనలు పునరావృతమైతే యావత్తు మహిళా లోకం టీడీపీ, జనసేనలను మరోసారి బంగాళాఖాతంలో కలిపేయడం ఖాయమని హెచ్చరించారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన



ధర్నా చేస్తున్న రైతు సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్) : కేంద్రంలోని మోదీ ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా చేశారు. 2021 ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా లిఖితపూర్వంగా ఇచ్చిన హామీలు అమలు చేయని కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. రైతులను, కార్మికులను మోసగించిన బీజేపీ, ఆ పార్టీతో ఎన్నికల్లో జతకట్టే పార్టీల అభ్యర్థులను ఓడించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతు పెట్టిన పెట్టుబడికి అదనంగా 50 శాతం కలిపి అన్ని పంటలకు మద్దతు ధరలు నిర్ణయించి ఆ ధరలు అమలయ్యేలా చట్టబద్ధత కల్పించినప్పుడే దేశంలో రైతులకు మనుగడ ఉంటుందని చెప్పారు. రైతులకు క్షమాపణలు చెప్పి మూడు వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేసిన సందర్భంలో ప్రధాని మోదీ మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రైతాంగ,కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీని రానున్న ఎన్నికల్లో ఓడించి వ్యవసాయ రంగాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కె.శ్రీనివాస్, డీఎన్‌వీడీ ప్రసాద్, బండి వెంకటేశ్వరరావు, బద్దా వెంకట్రావు, రెడ్డి శ్రీనివాస డాంగే, రాజనాల రామ్మోహనరావు పాల్గొన్నారు.

సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం అవసరం

ఏఆర్‌కే ఇన్ఫోసొల్యూషన్ కంట్రీ మేనేజర్ విశ్వేశ్వరన్



తాడేపల్లిగూడెం: అద్భుత ప్రపంచాలు సృష్టించాలంటే సరికొత్త సాంకేతికత అవసరమని ఏఆర్‌కే ఇన్ఫోసొల్యూషన్స్ కంట్రీ మేనేజర్ విశ్వేశ్వరన్ అన్నారు. ఏపీ నిట్‌లో గురువారం ఆగ్‌మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, మిక్స్‌డ్ రియాలిటీ సాంకేతికతలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. వర్చువల్ రియాలిటీ సాంకేతికతను వినియోగిస్తున్నప్పుడు ఓ సరికొత్త అద్భుత ప్రపంచంలోకి అడుగుపెట్టిన అనుభూతి కలుగుతుందన్నారు. టెక్నాలజీ వర్చువల్‌లో లీనమయ్యే అనుభవాలతో కూడిన డిజిటల్ కంటెంట్‌ను సృష్టించడం కోసం ఉపయోగిస్తారన్నారు. 2030 నాటికి ప్రపంచంలోని పరిశ్రమల్లో 5.0 లక్ష్యాలను అందుకోడానికి సరికొత్త సాంకేతికతలు దోహదపడుతున్నాయన్నారు. లేనిదానిని ఉన్నట్టు వాస్తవానికి దగ్గరగా మన కళ్లకు చూపించడమే ఈ టెక్నాలజీ ప్రత్యేకత అన్నారు. దీనిని ఒక్క గేమింగ్‌లోనే కాకుండా మాన్యుఫ్యాక్చరింగ్, కన్‌స్ట్రక్షన్, మెడికల్, ఆటోమొబైల్, రోబోటిక్స్, రక్షణ విభాగం వంటి ఎన్నో రంగాల్లో విరివిగా వినియోగిస్తున్నారన్నారు. ఈ వర్చువల్ సాంకేతికతలపై పట్టు సాధించిన విద్యార్థుల కొలువలకు కొదవ ఉండదన్నారు. సీఎస్ఈ విభాగాధిపతి కె.హిమబిందు, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, వి.సందీప్ తదితరులు పాల్గొన్నారు.